## క్లుప్తంగా

### యువత క్రీడల్లో రాణించాలి

తరిగొప్పుల: యువత వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల్లో రాణించాలని స్థానిక ఎస్సై గుగులోతు శ్రీదేవి అన్నారు. మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉచితంగా అందజేసిన క్రీడా దుస్తులను కబడ్డీ క్రీడాకారులకు శనివారం ఆమె అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ క్రీడలు శారీక ఎదుగుదలకు దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత

నర్మెట: బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ అన్నారు. వెల్దండకు చెందిన పాతూరి మధుసూదన్‌రెడ్డి కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్న విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ. 2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేశారు. కాగా మంజూరు పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. వారి వెంట భూపాల్ రెడ్డి, నర్సింహ, అంజయ్య, మధు, రమేష్, చంద్రమౌళి, రామకృష్ణ, యాదగిరి, నారాయణ, మనోహర్ ఉన్నారు.

### జాతర ఏర్పాట్ల పరిశీలన



పాలకుర్తి టౌన్ : శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఈనెల 25 నుంచి మార్చి 1 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా బందోబస్తు, పార్కింగ్ ఏర్పాట్లపై జాతర జరిగే పరిసరాలను పార్కింగ్ ప్రదేశాలను సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట పాలకుర్తి, కొడకండ్ల ఎస్సైలు దూలం పవన్‌కుమార్, రాజు, ప్రొబేషనరీ ఎస్సై రాజేందర్, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కమిటీ



లింగాలఘణపురం : కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా వడిచర్ల గ్రామానికి చెందిన చిటుకుల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా కొత్తకొండ ప్రణయ్‌చరణ్, కోశాధికారిగా బాలనర్సయ్య, గౌరవ అధ్యక్షుడిగా మంగ చంద్రయ్యలను ఎన్నుకున్నారు. కాగా జిల్లా అధ్యక్షుడు మెరుగు దేవరాజు, కార్యదర్శి కృష్ణ, కోశాధికారి వెంకన్నల ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగగా నియామక పత్రాన్ని అందజేశారు.

### మంద కృష్ణను కలిసిన ఎంఎస్‌ఎఫ్ నాయకులు



దేవరుప్పుల: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడాన్ని హర్షిస్తూ మంద కృష్ణ మాదిగను కలిసినట్లు ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. ఆయన వెంట ఎమ్మార్పీఎస్ నాయకుడు సోమయ్య ఉన్నారు.

### సబ్‌జైలులో బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ



జనగామ : జనగామ సబ్‌జైలులో ఉన్న స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డిని శనివారం ములాఖత్ ద్వారా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రఘునాథపల్లి : మండలంలోని గోవర్దనగిరికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దుస్స రవీందర్ అనారోగ్యానికి గురి కాగా మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల కోఆర్డినేటర్ విజయ్, నాయకులు ఉన్నారు.

# బోసిపోయిన క్రీడామైదానాలు

- బోర్డులకే పరిమితమైన స్థలాలు
- సీఎం కప్ తర్వాత కానరాని క్రీడాకారుల ప్రాక్టీస్
- నిరాశలో గ్రామీణ క్రీడాకారులు



చిల్పూరులో నిరుపయోగంగా క్రీడామైదానం

చిల్పూరు : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతలో దాగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికితీసి జిల్లా, రాష్ట్ర స్థాయిలో తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో గ్రామానికో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేశారు. ఒక్కో మైదానానికి రూ. 5 లక్షలు మంజూరు చేసింది. ఆ సమయంలో యుద్ధ ప్రాతిపదికన క్రీడామైదానాల బోర్డులు, స్థలాల్లో వ్యాయామం కోసం క్రీడాపరికరాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అధికారులు దాని వైపు చూడకపోవడంతో లక్ష్యం.. ప్రస్తుతం నిర్లక్ష్యంగా మారింది.

**నిర్వహణ మరిచిన అధికారులు**

గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆడే విధంగా స్థలాలను అనువుగా తయారు చేయించారు. అధికారులు అందుకు సంబంధించిన సామగ్రిని సమకూర్చకపోవడంతో కొన్ని చోట్ల ధాన్యం ఆరబోసుకోడానికి, మరికొన్ని చోట్ల వాహనాలు నిలపడానికి ఉపయోగంగా మారాయి. వ్యాయామం కోసం ఏర్పాటు చేసిన సామగ్రి తుప్పు పట్టిపోతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి క్రీడామైదానాల్లో సామగ్రిని సమకూర్చి క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

**తూతూ మంత్రంగా..**



గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్రీడామైదానాల్లో అధికారులు తూతూమంత్రంగా పరికరాలు ఏర్పాటు చేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారు. అధికారులు స్పందించాలి.
– అలుగు అశోక్, కబడ్డీ క్రీడాకారుడు, మల్కాపూర్

**సదుపాయాలు ఏర్పాటు చేయాలి**



క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో సదుపాయాలు ఏర్పాటు చేయాలి. గ్రామాల్లోని యువత ఈవెంట్స్ కోసం సాధన చేద్దామంటే సౌకర్యాలు లేవు
– మారపాక రమేష్, క్రీడాకారుడు కృష్ణాజీగూడెం

**ఎలాంటి ఆదేశాలు లేవు**



మండలంలో అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. అందులో పరికరాలు లేవన్నది వాస్తవం. వాటి ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నేటికి ఎలాంటి ఆదేశాలు లేవు.
– బర్మావత్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ

# ఆలయాల అభివృద్ధికి విరాళాలు



విరాళం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

నర్మెట : మండలకేంద్రంలోని కాకతీయుల కాలం నాటి అతిపురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గంగం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలోని ఆలయ కమిటీ భక్తులతో కలిసి పునర్నిర్మాణ పనులను చేపట్టారు. ఈ క్రమంలో బండి గోదావరి అంజయ్య దంపతులు రూ. 15,116 లు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రంగు మురళి (సామిల్) రూ. 5,116 లు, మడికొండ శేఖర్ రూ. 5,116 లు శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో అంజయ్య, రాజు, రమణ, ప్రజ్ఞాపురం శ్రీధర్, బాలయ్య, తిరుపతి, అంజయ్య పాల్గొన్నారు.

**దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి..**

మండల కేంద్రంలో 11 ఏళ్ల క్రితం దుర్గమ్మ ఆలయ నిర్మాణం చేసిన గ్రామస్తులు ప్రతీ రెండేళ్లకోసారి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మార్చి 1, 2 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ అధ్యక్షుడు బూస అంజయ్య ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టారు. కాగా గౌడ సంఘం రూ. 25,116 లు, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రంగు మురళి ( సామిల్) రూ. 5,116లు శనివారం ఆలయ కమిటీకి అందజేసారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు గోపగోని శ్రీధర్, ఉపాధ్యక్షుడు స్వామి, అంజయ్య, అశోక్, శ్రీధర్, సుదర్శన్, యాదగిరి, బాలరాజు, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, బాలకృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

### సేవాలాల్ జయంతికి రావాలని డీసీపీకి ఆహ్వానం



జనగామ: జిల్లా కేంద్రంలోని జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న సద్గురు శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ నియోజకవర్గ సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు శనివారం ఆహ్వానపత్రిక అందించారు. కలిసిన వారిలో ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ నాయక్, వైస్ చైర్మన్ అజ్మీర స్వామి నా యక్, కార్యదర్శి వాంకుడోత్ అనిత, దరావత్ శంకర్ నాయక్, ఈసీ మెంబర్ భుక్యా చందునాయక్, వాంకుడోతు అనిత, లాకావత్ నరే ష్, కొర్ర రాజేందర్, సురేష్ తదితరులు ఉన్నారు.

# వైభవంగా వారకల్యాణం



రఘునాథలపల్లి : ఆలయ చైర్మన్‌కు వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

చిల్పూరు : బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం భక్త జన సందోహం మధ్య గోవింద నామస్మరణలతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ వైభవంగా స్వామి వారి వార కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మిప్రసన్న, ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్తలు గనగోని రమేష్, తాళ్లపల్లి బుచ్చయ్య, రత్నాకర్‌రెడ్డి, చల్ల వెంకటరమణాదేవి, గోలి రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్,మహేష్, గాదె శేఖర్,హరిశంకర్, రాజేష్, విశాల్, శేఖర్ పాల్గొన్నారు. అనంతరం భక్తులకు హైదరా బాద్‌కు చెందిన సతీష్-పుష్పలత, సాయికిషోర్-కృష్ణసాయితిలు అన్నప్రసాద వితరణతో పాటు ఉత్సవ మూర్తులకు 437 గ్రాముల వెండితో తయారు చేయించిన 3 వెండి కిరీటాలను ఆలయానికి అందజేశారు.

**రఘునాథపల్లిలో మహాదేవస్వామి కల్యాణం**

రఘునాథపల్లి : స్థానిక మహాదేవస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ఉపేందర్-రేణుక దంపతుల ఆధ్వర్యంలో ఆలయ 4వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. టీటీడీ వేద పండితులు దేవగిరి సంతోష్‌శర్మ, దేవగి రి శ్యామ్‌శర్మ, ఆలయ పూజారి పిండిపోలు శ్రీని వాస్‌శర్మ మంత్రోచ్ఛరణలతో గణపతిపూజ, రక్షాబంధనం, కలశాభిషేకం, హోమం చేశారు. అనంత రం కల్యాణం వేడుకలను నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త బెల్దె లక్ష్మీనారాయణ, విజయలక్ష్మి దంపతులు అమ్మ వారికి వెండి కిరీటం బహూకరించారు. వేదకుమార్, వినయ్‌కుమార్, చిరంజీవి, శంకర్‌లింగం, రవీందర్, లింగయ్య, పోషనాథం, హరిప్రసాద్, వెంకటరమణ, కృష్ణమూర్తి, శ్రీనివాస్, బాలరాజు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

# చిందులను రెండో గ్రూపులో చేర్చడం హర్షణీయం

- చిందు హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి



మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు గణపతి

జనగామ రూరల్ : చిందు కులాన్ని రెండో గ్రూపులో చేర్చడం హర్షణీమని చిందు హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి అన్నారు. స్థానిక విజయ ఫంక్షన్‌లో జిల్లా కన్వీనర్ గజవెల్లి వెంకన్న ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా చిందు కులాన్ని రెండో గ్రూప్‌లో చేర్చడం జరిగిందన్నారు. సినీ నటుడు జబర్దస్త్ రాజమౌళి మాట్లాడుతూ వర్గీకరణలో మాదిగలతో పాటు మన కులాన్ని చేర్చడంపై ఎలాంటి నష్టం లేదన్నారు. కార్యక్రమంలో చిందు కుల యువత రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి ప్రతాప్, ప్రధాన కార్యదర్శి గడ్డం చిరంజీవి సుదర్శన్, తానీషా, శివాజీ, ఉమాపతి, రాజశేఖర్, సుమన్, ఈశ్వర్, రవి, జామదగ్ని, క్రాంతి, వంశీ, వెంకటయ్య, పరుశరాములు, పాల్గొన్నారు.

# పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు



మాట్లాడుతున్న రాపర్తి రాజు

జనగామ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ హాస్పిటల్, మెడికల్ కాలేజీ, హాస్టల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎంసీహెచ్ హాస్పిటల్ ఆవరణలో వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు ఉద్యోగ కార్మికులను రెగ్యులర్‌గా వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలని అన్నారు. ఈనెల 15వ తేదీలోపు పెండింగ్ వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు సమావేశంలో యూనియన్ అధ్యక్షులు రాం దయాకర్, అజయ్, రఘు, స్వామి, సునీత, కవిత, గోపాల కృష్ణ, సంపత్, కరుణాకర్, పద్మ, భారతి, అంజలి, సుమలత, స్వప్న, రజిత పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెంలో ఈనెల 3న ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలి ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు కృష్ణమూర్తి, మల్లయ్య, ఐలయ్య ఇళ్లు పూర్తిగా దగ్ధమై తీవ్రంగా నష్టపోయిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.25వేల చొప్పున మొత్తం రూ.75వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అదేవిధంగా ప్రభుత్వం తరపున మూడు కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయిస్తానని హామీ చేశారు. అదేవిధంగా కలెక్టర్ రిజ్వాన్‌బాషాతో పాటు గ్యాస్ ఏజెన్సీ వారితో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబాలను సత్వర న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు బెలిదె వెంకన్న, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, దైద ఎలిషన్, అజయ్‌రెడ్డి, ఎల్లగౌడ్, రాజయ్య, రాజు, రవీందర్, సీపీఎం నాయకులు విజయలక్ష్మి, యాకయ్య ఉన్నారు.

# ఢిల్లీలో బీజేపీ విజయం చారిత్రాత్మకం

ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీకి అఖండ విజయాన్ని అందించి చారిత్రాత్మక తీర్పును ప్రజలు ఇచ్చారని బీజేపీ నా యకులు అన్నారు. ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై శనివారం మండల కేంద్రాల్లో, ఆ యా గ్రామాల్లో బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చారు. అనంతరం మిఠాయిలు పంచి సంబురాలు చేసుకొన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.
– సాక్షి, నెట్‌వర్క్



కొడకండ్ల: బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నేతలు



నర్మెట : బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు



జఫర్‌గఢ్‌లో..



పాలకుర్తి టౌన్ : రాజీవ్ చౌరస్తాలో



దేవరుప్పల : స్వీట్లు తినిపించుకుంటున్న నేతలు

# బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న డీసీడీఓ గౌసియాబేగం

జఫర్‌గఢ్ : బాలికలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని డీసీడీఓ గౌసియాబేగం కోరారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆమె సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కరాటే శిక్షణ ద్వారా బాలికలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునే అవకాశం అభిస్తుందన్నారు. శిక్షణలో ప్రతిభను కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఉపాధ్యాయినీలు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యేకు పలువురి పరామర్శ



వెంకటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రేటర్ వరంగల్ కార్పొరేటర్లు

జఫర్‌గఢ్ : మండలంలోని ఉప్పుగల్లులో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు అరూరి రమేశ్ మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మున్సిపల్ కార్పొరేటర్లు జన్ను శిబారాణి, దివ్య రాణినాయక్, రాధికారెడ్డి, జక్కుల రజిత, ఈదురు అరుణ, గుజ్జుల వసంత, మునిగాల సరోజన మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ, స్వరూప, ఉమా శనివారం గ్రామానికి చేరుకుని అరూరి రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరితో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు, పార్టీ మండల కార్యదర్శి గుండె బోయిన రాజు, నాయకులు సుధాకర్, యాదగిరి ఉన్నారు. కాగా శుక్రవారం రాత్రి మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అరూరిని పరామర్శించారు.

### కాంగ్రెస్ మోసాలను వివరించాలి

జనగామ రూరల్ : కాంగ్రెస్ మోసాలను గ్రామాలకు వెళ్లి ప్రజలకు వివరించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ పోకల జమున అన్నారు. శనివారం మండలంలోని గోపిరాజుపల్లి, ఓబుల్‌కేశపూర్, పెద్ద రామచర్ల, గ్రామాల్లో కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తాళ్ల సురేష్ రెడ్డి, కమలమ్మ, ధర్మపురి శ్రీనివాస్, ప్రవీణ్ మహమ్మద్ యాకుబ్ పాషా, మహమ్మద్ మజీద్, అశోక్, శ్రావణ్, అరుణ్, అంజనేయులు, ప్రశాంత్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**ఘనంగా స్వయంపాలన దినోత్సవం**

జఫర్‌గఢ్/దేవరుప్పుల: జఫర్‌గఢ్ మండలంలోని కూనూర్, దేవరుప్పుల మండలంలోని మాదాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలతో పాఠశాల విధులకు హాజరయ్యారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు.

**ఎల్లమ్మ తండాను జీపీగా ఏర్పాటు చేయాలి**

పాలకుర్తి: మండలంలోని ఎల్లమ్మగడ్డ తండాను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామ సంఘం నాయకుడు బానోతు రమేష్ నాయక్ అన్నారు. శనివారం మాట్లాడుతూ గతంలో బమ్మెర జీపీ పరిధిలో ఉన్న తండాను నేడు అయ్యంగారిపల్లిలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. 400 పైగా జనాభా ఉన్న ఎల్లమ్మ గడ్డ తండాను ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేయాలని సీఎం, మంత్రులకు విన్నవించినట్లు తెలిపారు.

**వాసవి క్లబ్ గ్రేటర్ సభ్యుడి మృతి**

జనగామ : జనగామ వాసవిక్లబ్ గ్రేటర్ సభ్యుడు పులిగిల్ల సోమరాజు (71) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, వాసవి క్లబ్ వనిత క్లబ్ అధ్యక్షులు పడకంటి రవీందర్, డాక్టర్ వరూధిని సమాచారం మేరకు క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ దహన సంస్కారాల నిమత్తం రూ.25 వేలు అందించారు. పట్టణ ప్రముఖులతో పాటు వైఎస్‌ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తడక జగదీశ్వర్ మృతుడికి నివాళులర్పించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు.

**కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్**

పాలకుర్తి టౌన్ : స్థానిక బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, మాజీ మంత్రి దయాకర్‌రావు ప్రధాన అనుచరుడు జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.మదార్ శనివారం కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

తరిగొప్పుల: నాయకత్వం అంటే పదవుల కోసం కాదు, ప్రతీ ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాదగిరి అన్నారు. శనివారం మండలంలోని బొంతగట్టు నాగారం, నర్సాపూర్, అబ్దుల్‌నాగారం గ్రామాల్లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి**

దేవరుప్పుల: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ అన్నారు. శనివారం మండలంలోని రామరాజుపల్లిలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇన్‌చార్జ్ ఝాన్సిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

జనగామ రూరల్: వీవర్స్ కాలనీలో రాబోయే వేసవి కాలం దృష్ట్యా విద్యుత్‌కు అంతరా యం కలుగకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పా టు చేసినట్లు ఏఈ సౌమ్య శనివారం తెలిపారు. ఎస్‌ఎస్ 3/100 పై ఓవర్‌లోడ్ నుంచి ఉపయోగపడుతుంది.

**తిమ్మంపేటలో ప్రజ్ఞోత్సవ పోటీలు**

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూపీఎస్, పీఎస్ విద్యార్థులకు వివిధ అంశాలపై ప్రజ్ఞోత్సవ పోటీలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోటీలకు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు ఉపన్యాసం, కథలు చెప్పడం, డ్రాయింగ్, స్పెల్‌బీ, క్విజ్, స్కిట్, డ్యాన్స్, ఏకపాత్రాభినయం, గ్రూప్ డ్యాన్స్ తదితర పోటీలను నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంఈఓ రఘునాథరెడ్డి మాట్లాడారు.

**ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన**

పాలకుర్తి: కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఎం శ్రీ పథకంలో భాగంగా సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన పాలకుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎం శోభారాణి హాజరయ్యారు. వారం రోజులుగా జరుగుతున్న కార్యక్రమానికి ప్రదర్శనలు విద్యార్థులకు అవగాహన కల్పిస్తుందని అన్నారు.

**ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన**

కొడకండ్ల : సమాజంలో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలపై విద్యార్థులు ప్రదర్శించిన కళా ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. శనివారం దేవరుప్పులకు చెందిన శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థులు లీడ్ విద్య స్టూడెంట్ లీడ్ మానిటరింగ్ కొడకండ్ల, రామవరం, పాకాల గ్రామాల్లో కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు.

**ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేయాలి**



కొడకండ్ల : స్థానిక సంస్థల ఎన్నికల్లో సెక్షన్21(3) 1995 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి ఇద్దరు పిల్లల కంటే ఎక్కువ సంతానం కలిగిన వారికి కూడా పోటీ చేసే అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో శనివారం జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ అభిమన్ గాంధీనాయక్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించాడు. మండలంలోని గిర్నితండాలోని తన నివాసంలో దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి ఉదయం 11 గంటలకు నిరాహార దీక్షను చేపట్టాడు. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ ఇద్దరికి మించిన సంతానం కలిగిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే భాగ్యాన్ని కల్పించి తమ న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు.

**రైతులు వ్యయం చేసిన నిధులు ఇవ్వాలి**

పాలకుర్తి : మండలంలోని శాతపురంలో రైతులకు కాల్వపూడికతీత, పరిశుభ్రత పనుల్లో రూ.41 వేలు నిధులు వ్యయం చేశారని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల దేవరాజ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి కాల్వ పనులు పరిశీలించారని అన్నారు. ఆ సమయంలో రైతులు తమ డబ్బులు వసూలు చేసి వ్యయం చేసిన డబ్బులు ప్రభుత్వం ఇవ్వాలని అనలేదని అన్నారు. కాల్వ మరమ్మతులకు నిధులు కేటాయించాలని అన్నారు.